# చిలకపచ్చ చీర

"ఈ చీర నే నుంచుకుంటా... ఈ రోజు కట్టుకుంటా!" అంది బాలమణి - ఆశగా.

అప్పుడే మగ్గం దిగిన చిలకపచ్చ చీరనూ, దాన్ని మడత పెడ్తున్న భర్తనూ చూడగానే బాలామణి కళ్ళల్లో కోరిక తళుక్కుమంది. మొహం ఇంద్రధనుస్సే అయింది ఒక క్షణం. బకమ్మను పేరుస్తున్న చేతులు యాంత్రికంగా ఆగిపోయినై.

భార్యనోసారి వేదాంతిలా చూచి కళ్ళు దించుకున్నాడు నారాయణ.

ఆ రోజు బతుకమ్మ పండుగ. ఊరంతా హుషారుగా ముర్తుస్తుంది. సూర్యకిరణాలు ప్రకృతి ఒళ్ళు తడుమకముందే మేల్కొన్నారు జనాలంతా. అలవాటు ప్రకారం అందరికంటే ముందే మెలకువొచ్చింది నారాయణకు. మొహం కడిగి మగ్గమ్మీద కూచ్చున్నాడు. భూపాలం పాడుతూ మగ్గం నేస్తుంటే బాలామణి కండెలు అందిస్తూంది.

చిలకపచ్చ చీర నేస్తున్నంతసేపూ బాలబణి మనసంతా దాని మీదే తచ్చాడింది. అందించాల్సినకండెలు అందించి బతమమ్మను పేర్వడం మొదలెట్టింది. శోభనం గదిలో అందమైన మగని వైపు ఆశగా ఆడుగు లేస్తున్న పెళ్ళికూతురైంది కోరిక.

"ఆరు చీరలు దిగినై. రేపటి కేడౌతవి. ఏడింటికి ఏడూ రేపు షావుకారింటి కెళ్ళిపోతై. పండగనా డడిగితే కాదనకపోవచ్చు" అనుకుంది.

చందమామను తెచ్చి చేతికివ్వ మన్న చిన్నపిల్లలా గన్పించింది బాలమణి వాలకం - నారాయణకు.

భార్య మొహాన్నీ బంతిపూలనూ మార్చి మార్చి చూస్తూ.... "నిజంగానే అంటున్నావా?" అన్నాడు. మడతపెట్టడ మాపేసి - మోకాళ్ళ మీద కూచుండిపోయా డలాగే.

"ఏడు నేసిన కూలీ డబ్బులు ఈ చీరతో చెల్లుబాటైతే, ఇంక ఇల్లెట్లా గడవాలి?" అన్నట్టుగున్నా యతని చూపులు.

కనురెప్పలు భారంగా దించుకుంది బాలమణి.

"అందని ఆకాశానికి నిచ్చెన వెయ్యడ మెందుకూ?" మందలించింది అంతరాత్మ.

షావుకారు పదిహేను రోజుల కోసారి నూలు ఇస్తాడు. ఇచ్చిన నూలు ఏడు చీరలకు బొటాబొటిన సరిపోతుంది. నూలు మగ్గాని కెక్కేముందు భార్యతో కలిసి పడుగు చేస్తాడు. వాటికే ఐదారు రోజులు పడ్తుంది. దొడ్డు చీరైతే రోజు కొకటి, సన్నదైతే రెండ్రోజుల కొకటి దిగుతుంది. తాను మగ్గం నేస్తుంటే భార్య కండెలు చుట్టి వెంట వెంటనే అందిస్తుంటే నేత పని సాఫీగా సాగుతుంది.

నేత కూలి... దొడ్డు చీరకు పది రూపాయలు, సన్న చీరకు ఇరవై.



ఐతా చంద్రయ్య

పెద్ద కూతురు చంద్రకళ తోడుగా ఉంటుంది. రాత్రింబవళ్లు కష్టించి రోజు కో చీర దించగలుగుతున్నాడు. పదిహేను రోజుల కోసారి ఏడు చీరలు షావుకారింటికి చేర్చాలి. నూటానలభై రూపాయలూ, మరో ఏడు చీరలకు నూలు తెచ్చుకోవాలి.

తనూ, భార్యా, ఇద్దరాడ పిల్లల జీవితం గడవాలి కూలి ఉబ్బుల్తో. పెద్దమ్మాయి చంద్రకళ ఈడేరి ఏడేండ్లయింది. ఇల్లు గడవడమే గగనమై పోతుంటే అమ్మాయికి పెళ్ళి చెయ్యాలనే ఆలోచనే రాలేదు.

తల్లి కండెలు చుడుతూంటే, చంద్రకళ వంటపనీ, ఇంటిపనీ చూస్తుంది. చిన్నమాయి సంధ్య తనకు తోచింది చేస్తూంది.

"ఇంకొంచెం నూలు ఎక్కువిస్తే ఇంకా కష్టపడి ఎక్కువ చీరలు సేస్తాను గదా!" అన్నాడోసారి షావుకారుతో.

"ఓరి పిచ్చి పుల్లయ్యా!" అన్నట్టుగా నవ్వేడు షావుకారు.

"ఇవి వెనకటి రోజుటు కావు నారాయణా! అసలు నూలు దొరకడమే కష్టమైపోతూంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూలు మీద సబ్సిడీలు తీసెయ్యడంతో నూలు ధరలు ఆకాశన్నంటినై. నేనా-వడ్డీ వ్యాపారిని కాదు. పెట్టుబడి గూడా అంతంతమాత్రమే గదా! ఏదో...నా మీద ఆధారపడి మీరూ, మీ మీద ఆధారపడి నేనూ బలకాల్సిందే తప్ప, మనల్ని పట్టించుకునే నాథుడే లేదు!" అన్నాడు.

"ఇల్లు గడవడం కష్టంగా ఉంది. కూలీ రేట్లన్నా కొంచెం పెంచితే బావుండేది కదా?" అన్నాడు తోటి నేతగాడు యాదగిరి.

అదేదో బూతూ మాట విన్నంత ఇదైపోయాడు షావుకారు. ఆ తర్వాత, "పాపం, మీ అమాయకుల కేందెల్సూ?" అన్నాడు.

"యాదగిరీ! సబ్సిడీలు ఎగిరిపోగానే నూలు ధరలూ, రంగుల ధరలూ పెరిగినా యన్నాను గదా! దాంతో నేత చీరల ధరలూ పెంచక తప్పలేదు. చీరల ధరలు పెరిగినై కాబట్టి, దుకాణాల్లో జనాలు మిల్లు చీరల్నే కొంటున్నారు. నేత చీరల గిరాకీ బాగా తగ్గింది. మీ కిప్పుడు కూలీలు పెంచితే, మళ్ళీ చీరల ధరలు పెంచాలి. అప్పుడు మన చీర ఒక్కటి కూడా అమ్మదు. ఫెయిలైన సినిమా బాక్సుల్లా మన చీరల గట్టాలు వాపసొస్తై. అప్పుడు నేను చీరలు నేయించను, మీకు పని దొరకదు. మీరూ, నేనూ కడుపులు మాడి చావాలి." అనంత సత్యం చెప్పేశాడు.

షావుకారు చెప్పేది నిజమే నన్పించింది.

"సరే...వద్దు!" అంది బాలమణి తిరిగి బతకమ్మ వైపు తిరిగి.

"మనం నేసిన గుడ్డల్ని మనమే వాడుకునే రోజులు కావివి" అంటూంటే, నారాయణలో నిర్వేదం కలుక్కుమంది.

.....ఆ రోజులే వేరు. చేతి వృత్తుల కెంతో గౌరవముండేది. మిల్లు చీర లొచ్చింతర్వాత నేతగాళ్ళ చేతులు నరికేసినట్లైపోతుంది. "భారీ యాంత్రీకరణ మన దేశానికి సరిపోదు. కుటీర పరిశ్రమల్ని ప్రోత్సహించా"లన్న గాంధీ మహాత్ముని మాట... నీటి మూటైపోయింది. దేశం యంత్రమయమై పోతుంటే, నిరుద్యోగం సవాలై కూచింది.

ఏడోతరగతి పూర్తయిన తర్వాత "కళ విద్య లెన్ని నేర్చిన కుల విద్యల సాటి రావ"న్న గువ్వల చెన్నా పద్యం వినిపించి, కుల విద్యలే కూడూ, గూడూ పెడతాయని, వంశపారంపర్యంగా వస్తున్న నేతను నమ్ముకొమ్మన్నాడు తండ్రి. అప్పుడది బంగారు గుడ్లు పెట్టే కోడిలా కన్పించింది. వేరే ఏ పనీ నేర్చుకోవాల్పించలేదు.

ఇప్పుడో...?! రాను రాను రాజు గుఱ్ఱం గాడిదైందన్నట్టు...తన రెక్కలు ముక్కలు చేసుకుని నేత పనిలో మునిగినా భార్యా బిడ్డలు బజారుపాలు కాకుండా జాగ్రత్తపడ్డంతోనే సరిపోతుంది.

ఎలక్షన్లొస్తే నాయకులు తమ ఇళ్ళ చుట్టూ తిరిగి, "మీ వృత్తి చాలా పవిత్రమైంది. మళ్ళీ మీకు మంచిరోజులొచ్చేలా చూస్తా"మని ఏవేవో వాగ్దానాలు కుమ్మరిస్తారు. పూటుగా తాగించి, ఓట్లు దండుకుపోతారు. కుండలుంచి బిందెలు తీసుకెళ్ళిపట్లయిందని, తర్వాత బాధపడ్డం నేత గాళ్ళ వంతై పోతుంది.

పెళ్ళి కాగానే... ఇంట్లో అడుగు పెట్టిన బాలమణి ఎన్ని ఆశలు కొంగున మోసుకొచ్చిందో... అప్పుడెంత అందంగా ఉండేదని! నవనవలాడే దేహఛాయ, నిగనిగలాడే చెక్కిళ్ళు, సోయగాన్నంతా సొంతం చేసుకున్న కళ్ళల్లో కమ్మని కాంతి...తన గుండెల్లో తియ్యని కోర్కెలు రేపినై ఆ రోజు....పూలతీగల్లాంటి ఆవిడ చేతులు తనను చుట్టేస్తుంటే... తన ఊపిరిలో ఊపిరైపోతుంటే...ఏది ఏమైనా సరే-ఆమె అశల్ని వమ్ము చేయరాదను కున్నాడు.

తొలిరోజులు నిండు పున్నమి వెన్నెలలో విహరించినట్టు గడిచినై.

"ఇరవై సంవత్సరాల్లో...జీవితం... - జీతం మధ్య ఎంత అంతర మొచ్చేసింది? అప్పుడు ఇదే చీర కూలి ఆరు రూపాయలు. అప్పుడు గూడా నెలకు పధ్నాలుగు చీరలే దిగేవి. నెలకు ఎనభై నాలుగు రూపాయల కూలీ దొరికేది. నలభై రూపాయలకు బస్తాబియ్య మొచ్చేవి. తల్లీ, తండ్రీ, తనూ, బాలమణి - అప్పుడు నలుగురే... ఇప్పుడూ నలుగురే ఇప్పుడు ధరలేమో చుక్కలకెక్కి వెక్కిరిస్తున్నై.

"నా బతకమ్మ పేర్వడమైపోయింది. అట్లాగే కూసున్న వేందీ?" అంది బాలమణి శూన్యంలోకి చూస్తున్న భర్తను కుదిపి.

నారాయణ ఆలోచనా వీచికలు చెల్లా చెదరైనై.

"ఆఁ. రేపటికల్లా మరోటి నేస్తే ఏడైపోతై. షావుకారు కిచ్చెయ్యాలి" అంటూ మగ్గంవేపు నడిచాడు.

బతకమ్మను సాగనంపి వచ్చిం తర్వాత "అందరూ కొత్తచీరెలు కట్టుకొచ్చింద్రు, మనవే పాతవి" అని సంధ్య రుసరుసలాడుతుంటే తండ్రి కడుపులో దేవినట్లైంది.

"ఈ దరిద్ర మెప్పుడు పోతుంది నాయనా? నా తోటోళ్ళంతా పిల్ల తల్లులైంద్రు, పట్టుచీరెలు కట్టుకొచ్చింద్రు." కడుపులోంచి తోసుకొచ్చిన బాధ చంద్రకళ కళ్ళల్లో బిందువులుగా మారింది. మొహం కళావిహీనమైంది.

"నువ్వుకూడా అంటున్నావా చంద్రకళా?" బాలమణి అందుకుంది. "రాత్రనకా, పగలనకా మీ నాయిన కష్టం జేస్తున్నడు. బొక్కలు చిక్కినై. ఇంకేం జెయ్యిమంటవే?...." భయంకరమైన దగ్గుతెర గొంతునొక్కేసింది.

చంద్రకళ అందించిన నీళ్లు తాగేసి మంచంమీద ఒరిగిపోయింది. కళ్ళు అవ్యక్తమైన బాధతో చెమ్మగిల్లినై- వెడల్పాటి ఆశయాలు చిలక పంజరంటాంటి జీవితంలో బంధించ బడ్డాయని.

బాలమణి చాలా రోజుల్నుంచి దగ్గుతుంది. ఒక్కోసారి రెండు మూన్నిముషాలు ఆగకుండా దగ్గుతూ అల్లాడిపోతుంది. డాక్టరుకు చూపిస్తానంటే- "నాకేమీ కాలేదు, అదే తగ్గిపోతుంది" అంటుంది. అ మాట వెనక దాగున్న అంతరార్థం అతనికి మాత్రమే తెలుసు.

"రేపు ఈ చీర లిచ్చిన తర్వాత డాక్టరుకు చూపిస్తా బాలమణీ!" అన్నాడు మగ్గమ్మీద కూచుంటూ.

"నాకూ బాగానే ఉందిగాని, ఎల్లుండి దసరా. నీకున్న ధోవతి చినిగింది. ఇంట్లో ఉండేవాళ్ళం మేమెలాంటివి కట్టినా చెల్లుగుంది. నువ్వేమో బయటికెళ్ళితీరాలయె. ఒక ధోవతి కొనుక్కో ముందు" అంది బలాన్నంతా కూడదీసకుని లేచి కూచుంటూ.

షావుకారు చీరలందుకుని, నూటా నలభై రూపాయలు చేతిలో పెడ్తూ-

"ఏమీ అనుకోకు నారాయణా! నీ ధోవతి బాగా చినిగింది. దాంతో బజార్లో కెట్లా రాగలిగావ్?" అన్నాడు.

తల తీసేసినట్లైంది.

నూటా నలబైలోంచి ఇరవయైదు రూపాయల్తో ఒక ధోవతీ కొనేశాడు. మిగతా డబ్బులు సరకులకు సరిపోలేదు. పద్దు రాయించక తప్పలేదు. ఈసారి తీసుకొచ్చిన నూలంతా చిలకపచ్చ రంగుదే. ఇందులోంచి ఒక చీర బాలమణికి ఉంచాలనుకున్నాడు.

దసరానాడు కొత్త ధోవతి కట్టుకుని మిత్రులతో జంబికెళ్తుంటే నారాయణకు స్వర్గలోకంలో విహరిస్తున్నట్టనవించింది.

తిరిగొచ్చే సరికి ఇంటి నిండా జనాలున్నారు. బాలమణి మంచమ్మీద పడుకునుంది. ఇద్దరు కూతుళ్ళు 'అమ్మా, అమ్మా' ఏడుస్తున్నారు - తల్లిమీద పడి.

నారాయణ గుండెలు గుబగుబలాడినై.

"ఏమైందీ?"

గుహలో పులి నోటికి చిక్కిన మేకలా వినిపించింది నారాయణ గొంతు.

"అమ్మ దగ్గీ దగ్గీ చచ్చిపోయింది నాయినా!" చంద్రకళ తల బాదుకుంది.

ఆకాశం విరిగి మీద పడింది. చుట్టూ ఉన్న గోడలూ, కాళ్ళూ పాతాళంలోకి కుంచించుకుపోతున్నట్లనిపించింది.

"అయ్యో బాలమణీ!" కేకేసి కుప్పలా కూలిపోయాడు.

"నన్ను కట్టుకుని నువ్వేం సుఖవడ్డావ్? నేతగాని భార్యవై నందుకు జీవితమంతా వెతలతో గడిచింది గద!" కడుపు పొరల్లోంచి తెరలు తెరలుగా తన్ను కొచ్చిన దుఃఖం కరిగి కళ్ళద్వారా దారాపాతమైంది. చీకటి సముద్రం కెరటాలు జీవితపు అంచుల్ని కసిరి కసిరి కొట్టినై.

రావాల్సిన వారంతా వచ్చి, అంత్యక్రియలకు డబ్బు కావాలన్నారు.

ఎక్కడుంది డబ్బు?

"ఎక్కడైనా అప్పు తెస్తే...?" సలహా పారేశా డొకాయన.

"నేత గానికి అప్పెవ డిస్తాడు?" సమాధానం చెప్పా డింకొకాయన.

బాలమణి మంగళసూత్రం అంత్యక్రియల కాదుకుంది.

వారం రోజుల ఏడ్పుల తర్వాత కర్తవ్యం గుర్తుకొచ్చింది.

చంద్రకళ కండెలు చుట్టిస్తానంది. వంటింటి భారం సంధ్యమీద పడింది. బాలమణి పనులు చంద్రకళ చేస్తుంది.

సరుకులన్నీ నిండుకున్నై.

చంద్రకళ చొరవవల్ల చేబదుళ్ళతో మూడ్రోజులు గడిచినై. అప్పటికింకా చీరలు దిగలేదు.

ఒక రోజు ఉపవాసంతో గడిచింది.

దీపావళి పండుగ రాబోతుంది.

మర్నాడు చంద్రకళ నిద్రలేచే సరికి తెల్లవారింది.

తెల్లవారకముందే తనను నిద్రలేచే సరికితెల్లవారింది.

తెల్లవారకముందే తనను నిద్రలేపి తను మగ్గమ్మీద కూచుంటానన్నాడు రాత్రి తండ్రి. మరెందుకు లేపలేదూ?

తండ్రి మంచం దగ్గర కెళ్ళింది. మంచమ్మీద నారాయణ కన్పించలేదు. మగ్గం చప్పుడు కూడా లేదు. అయినా అటువైపెళ్ళింది. నారాయణ మగ్గానికి వేళ్ళాడుతున్నాడు.

నడుంవరకు మగ్గం పైకి... కాళ్ళు గుంతలో... నాలుక బయటికొచ్చింది. మొహం భయానకంగా మారింది.

చంద్రకళ గుండెల్లోంచి ఉద్భవించిన భయం పెద్ద కేకగా వెల్వడింది. కండరాలన్నీ ముక్కలుగా కోసినట్టు, చావుకన్నా భయంకరమైన అనుభవం.

ఆ కేక చుట్టుపక్కల వాళ్ళకు ఆర్తనాదంలా వినబడింది. అందరూ పరుగెత్తుకొచ్చారు. క్షణాల్లో ఇల్లంతా నిండిపోయింది. వింతగా చూస్తున్నారంతా.

"ఎప్పుడో చచ్చాడు పాపం!" అన్నాడొకాయన.

"నమ్ముకున్న మొగ్గం ఉగ్గమైపోయింది" అన్నాడు యాదగిరి.

శవం నడుముకో కాగితం కన్పించింది. గట్టిగాచదివాడు యాదగిరి:

"అమ్మాయిలూ!

"మా అమ్మా నాయనలు నిన్ను పెంచినట్టు నేను మిమ్మల్ని పెంచలేకపోయాను. రానురాను బ్రతుకు భరమైపోతుంది. కన్నకూతుర్ల పేగులు ఆకలితో మాడుతుంటే నా కండలు కోసి కారం చల్లినట్లయింది. ఈ బాధ, మానసిక క్షోభ భరించలేను. సంపాదించి మిమ్మల్ని సాకలేను. మీ పెళ్ళిళ్ళు చెయ్యలేను.

"మీ అమ్మతోనే నేనుకూడా పోయాననుకోండి. నేతగాని కడుపున పుట్టినందుకు మీరు జీవితమంతా ఏడ్వాల్సివస్తుంది. నా కడుపున పుట్టడమే మీరు చేసిన పాపం. నేను చస్తే సమాజం సానుభూతన్నా మీకు దక్కుతుంది. అదే మీకో దారి చూపిస్తుంది. చేతగాని ఈ నేతగాణ్ణి క్షమించండి. మీ అమ్మ దగ్గరికే వెడుతున్నాను. అసమర్థుడైన మీ నాయన నారయణ."

(ఆంధ్రప్రభ వారపత్రిక 25-31 మే, 1994)

